
మన దేశంలో అతి అరుదైన, విలువైన ఎంత కష్టపడ్డా దొరకని 'వస్తువు' 'పెళ్ళి కొడుకు' అంటే ఏమీ అతిశయోక్తి లేదని నా అభిప్రాయ్య ర. ఎందుకంటే ఈ విషయమ్మీద నేను కొంత పరిశోధన చేశానని నా నమ్మకం. నా అభిప్రాయాలు, నమ్మకాలు అలా వుంచి నా స్నేహితుడు నారాయణ రావు విషయం చెప్పడం సమంజసంగా వుంటుందిక్కడ.

నారాయణ రావుని నేను చిన్నప్పట్నుంచీ ఎరుగుదును. వెరీ బ్రయిట్ స్టూడెంట్. అమ్మా, నాన్న కష్టపడి ఆ రోజుల్లో ఇంజనీరింగ్ చదివిస్తే చదువుకుని ఓ గొప్పింటి అమ్మాయిని పెళ్ళాడాడు మంచి కట్నంతో. 'అదేమిట్రా?' అంటే ఆనక నాకు వాళ్ళవల్ల చాలా ఉపయోగాలు, అవసరాలు వుంటాయని చెప్పి తల్లిదండ్రుల నోళ్ళు మూయించాడు. ఆ తర్వాత భార్యతో టింగురంగా మంటూ ఢిల్లీయో, కలకత్తాయో వెళ్ళిపోయాడు ఉద్యోగానికి.



# ఫైవ్‌స్టార్ తండ్రులు

ఆకెళ్ళ గిరిజ

మరి నాక్కనపడలేదు. నాకేమిటి - వాళ్ళ అమ్మా, నాన్నలకే కనపళ్ళేదు. పాతికేళ్ళ తర్వాత మొన్న నాకు సికింద్రాబాద్ స్టేషన్లో కనపడ్డాడు.

గుర్తుపట్టడానికి కొంచెం సేపు పట్టింది. గాని ఆట్టే కష్టపళ్ళేదు నేను ''ఎక్కడుంటున్నావు?'' అడిగాను.

''ఇక్కడే హైద్రాబాద్‌లోనే వుంటున్నా...''

''మరి ఢిల్లీనో,, కలకత్తానో కదూ...''

''అబ్బో ఏనాటి మాట... అవన్నీ పోయాయి. నువ్వేం చేస్తున్నావ్?'' అడిగాడు నారాయణ రావు నావేపు కళ్ళజోడులోంచి చూస్తూ. ఇన్నేళ్ళ కాలం మనిషిలో చాలా మార్పు తెచ్చింది. చెప్పాను నేనేం చేస్తున్నదీను!

''ఎక్కడుంటున్నావ్?''

''గాంధీ నగర్‌లో...''

'నేను అక్కడే. చిక్కడపల్లి... ఒక్కసారి మా ఇంటికి రా...'' అని అడ్రస్ రాసిచ్చాడు. ఈ లోగానే నేనెక్కాల్సిన బండి రావడంతో నారాయణ రావుకి వీడ్కోలు చెప్పి బండిలో పడ్డాను.

★★★★★

సుమ చక్కని పిల్ల. వయస్సు ఇరవై ఆరు. ఎం.ఎ. పాసైంది. అమ్మాయి ఫెయిర్‌గా, జనముద్దుగా వుంటుంది. ఓ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తోంది. అన్నిటినీ మించి ఓ మంచి పెళ్ళి కూతురు. ''మన వాళ్ళలో ఏదైనా మంచి సంబంధం వుంటే చెబుదూ!'' అన్నాడు వాళ్ళనాన్న నారాయణ రావు నేను వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఓ కప్పు కాఫీ సేవించాక.

''అలాగే చూద్దాం... దానికేం భాగ్యం.. ఎవరైనా వుంటే తప్పకుండా చెప్తాను'' అన్నాను సిగరెట్ వెలిగించి.

''చూద్దాం... చేద్దాం... అంటే కాదు. నీవు తప్పక సాయం చెయ్యాలి. మన స్నేహాన్ని దృష్టిలో పెట్టుకుని అడుగుతున్నా'' అన్నాడు నారాయణ రావు.

''నువ్వింతగా చెప్పాలా! నాకు మాత్రం తెలీదు! మీ అమ్మాయిని చూశాను. సరే.. వరుడి విషయంలో మీకు కావల్సిన అర్హతలేమిటో కూడా చెప్తే నేను ఎలాంటి అబ్బాయిని సజెస్ట్ చెయ్యాలో నాకు ఓ అయిడియా వస్తుంది...'' అన్నాను.

''అమ్మాయి ఎం.ఎ. పాసైంది. అబ్బాయి కూడా పోస్టుగ్రాడ్యుయేటో... ఇంజనీరో అయి వుండాలి. సరే ఉద్యోగస్తుడై వుండటం ఇక ఎలాగూ తప్పదు... అమ్మాయి ఫెయిర్‌గా వుంటుంది కాబట్టి... కాస్త ఫెయిర్‌గా వున్న కుర్రాడైతే ఈడుజోడు బావుంటుందని మా అభిప్రాయం...'' అని ఆగి కళ్ళజోడులోంచి సూటిగా నావంక చూశాడు నారాయణ రావు.

''సరే... అన్నీ బాగానే వున్నాయి. అమ్మాయి జాతకం, ఫోటో ఒకటి వుంటే ఇయ్యి... నా ప్రయత్నం నేను చేస్తాను'' అన్నానేను. సిగరెట్ యాష్‌ట్రేలో కుక్కుతూ.

''దీని పెళ్ళిగురించే బెంగ పెట్టుకున్నామనుకో... నా ప్రయత్నం నేను చేస్తున్నా... కానీ కాలం కల్సి రావాలిగా...''

''బెంగ పెట్టుకుంటే అవుతాయా! టైము రావాలి దేనికైనా... అన్నట్టు అడగడం మర్చేపోయా.. నువు కట్నం ఎంతవరకూ ఇవ్వగలవు? అదికూడా నాకు మనస్సులో ఓ అయిడియా వుండాలిగా... అందుకోసం అడుగుతున్నా...''

నారాయణ రావు కొంచెం అసహనంగా కదిలాడు. ''కట్నం అంటే ఇక్కడ చిక్కొచ్చిందంటే... మై డాటర్ ఈజ్ ఎడ్యుకేటెడ్. హాండ్సమ్.. అండ్ ఎర్నింగ్ ఆల్సో... షి ఈజ్ డెడ్ వాగెన్స్ట్ ఇట్... నేనేదో పెళ్ళి సాంప్రదాయకంగా చేసి పంపిస్తాననుకో.. దానికేం లోటులేదు ఆహ్'' నవ్వాడు.

''అఫ్‌కోర్స్... ఆదర్శం మంచిదే. కాదనను. కానీ ఇవాళ పెళ్ళిళ్ళ మార్కెట్ ఎలా వుందంటే... ఆడపిల్లకి అందం, చదువు, ఉద్యోగం వుండాలి.. ప్లస్ దానికి తగ్గట్టుగా కట్నం, బంగారం, వెండి, స్టీలు, ఇలా తదితర లోహాలు... శక్త్యానుసారం... నువ్వు ఇవ్వగలిగినన్నీ వాళ్ళు పుచ్చుకుంటారు. అందం, ఉద్యోగం అనేవి అదనపు అర్హతలవుతాయి గాని.. ముఖ్యార్హత మాత్రం ఇంకా కట్నమే.. నూటికి తొంభై అయిదు శాతం. ఇలా నేను నిర్మొహమాటంగా అంటున్నానని ఏమీ అనుకోవద్దు. లోకం నువ్వు చూసిన వాడివే.. అమ్మాయికి చెప్పు.. అదే ఆదర్శంగా ప్రాకులాడితే మాత్రం సంబంధం కుదరడం కష్టమవుతుంది... నేనెంతో మంది పెళ్ళి కూతుళ్ళని ఎరుగుదును. అందం, చదువు, సంపాదన, వుండి కట్నం కోరివంత శాస్త్రమని తిరుగుతున్న వాళ్ళకి కూడా పెళ్ళిళ్ళు కుదరడం లేదు ఈ రోజుల్లో... అలాని నా ప్రయత్నం నేను చేస్తాలే... నిన్ను బెదరగొట్టడానికంటున్నా ననుకోకు... వస్తాను...'' అని లేచా...

నారాయణ రావు తను ఉద్యోగాలు మారడం, ఊళ్ళు తిరగడం చివరకు బిజినెస్ చేసి నష్టపోవడం ఆడపిల్లల పెళ్ళిళ్ళ కోసమే హైద్రాబాద్ రావడం ఇవన్నీ కాస్సేపు వివరించాడు నన్ను సాగబెడుతూ...

అతని దగ్గర సెలవు తీసుకుని బయల్దేరాను.

★★★★★

''వీల్లేదు.. ఛస్తే నేనొప్పుకోను... నా తమ్ముడికేం కాలు వంకరా? కన్ను వంకరా? నిక్షేపంలా కంప్యూటర్ ఇంజనీరు. అయిదువేలు సంపాయిస్తున్నాడు: ఎంత అందగత్తె, ఉద్యోగిని అయితే మాత్రం కానీ కట్నం లేకుండా నా తమ్ముడికి ఛస్తే నేచేసుకోను... పాపం. మీ తమ్ముడికి మాట్లాడ లేకపోయారా.. మావాడే తేరగా దొరికాడా?...'' అంటూ మా ఆవిడ ఎదురుదాడి ప్రారంభించేసింది.

''అబ్బ... ఇప్పుడేమన్నాననీ... వూరుకోవే... వాళ్ళకి పోస్టుగ్రాడ్యుయేటు కావాలట... మా తమ్ముడు పనికిరాడు. లేకపోతేనా... ఎప్పుడో మాట్లాడేసే వాణ్ణి... అసలు మీ ఆడాళ్ళవల్లే కట్నాలిలా పెరిగి పోతున్నాయ్...''

''ఔను పాపం. మీరేమన్నా కట్నం తీసుకున్నారా ఏమన్నానా?''

''నిజం. ఒట్టు. నేను తీసుకోలేదే... అంతా మానాన్నే మేనేజ్ చేశాడు. దానికి నన్నంటే ఏం ప్రయోజనం?

''చెప్పకండి. ఈ నంగనాచి కబుర్లు...'' కోపంగా లోపలికి వెళ్ళిపోయింది ఆవిడ.

అనవసరంగా పలకరించానని లెంపలు వేసుకున్నా..

★★★★★

నాకు తెలిసున్న ఒక సంబంధం నారాయణ రావు కూతురు సుమకి సజెస్ట్ చేశాను. కుర్రాడు ఎం.ఎ. పాసై ఓ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. వాళ్ళు కట్నాలు అవీ ఏమీ కోరలేదు. పిల్ల ఫెయిర్‌గా వుంటే చాలన్నారు. ఉద్యోగం కూడ వుంది కాబట్టి సుముఖంగానే కనిపించారు. అబ్బాయి కూడా నారాయణ రావు కోరుకున్నట్టు ఈడుజోడు కుదిరి, స్మార్ట్‌గా వున్నాడు.

మొత్తానికి నేను, నారాయణ రావు నాలుగుసార్లు, అటు, ఇటు తిరిగి పెళ్ళి చూపుల తతంగం అయిందనిపించాము. మగపెళ్ళివారు ఏ విషయం తరువాత కబురు చేస్తాం అన్నారు.

ఈలోగా ఏమైందో ఏమో నేను కొన్ని అర్జెంటు సొంత పనులవల్ల బిజీగా వుండి నారాయణ రావుని కలవలేదు ఓ పదిహేను రోజులపాటు.

తర్వాత రోజు నారాయణ రావు వెతుక్కుంటూ మా ఇంటికొచ్చాడు. పెళ్ళి కుదిరిందనే వార్త చెప్పడానికొచ్చాడనుకుని నేనూ సంతోషంగా వున్నాను.

''మూర్తీ! అంతాబాగానే చేశాం గానీ చివర్లో పెటకం పెట్టేశారయ్యా!'' అన్నాడు.

''ఏమిటి? ఏమైంది? పెళ్ళివారి గురించేనా?'' ఆత్రంగా అడిగాను.

''అవునయ్యా! వాళ్ళ విషయమే మొన్ననే వెళ్ళి కలిసి మాట్లాడితే అంటారూ అబ్బాయి కాలేజీ దూరం అయిపోయిందంట! అందుకోసం స్కూటర్ కావాలంటున్నాడుట! అంటూ పిల్లాడితల్లి సన్నాయి నొక్కులు నొక్కుతోంది...'' అన్నాడు నారాయణ రావు.

''ఇంత దాకా వచ్చాక వెనక్కి లాక్కూడదయ్యా! పోనీ స్కూటర్ కొను.. పాతికవేలు... అంతేగా!...''

''కర్రెక్టే.. కానీ పెళ్ళిఖర్చులు పాతికో ముప్పయ్యో అవుతాయి. ఇప్పుడు మళ్ళీ పాతికవేలు పెట్టి స్కూటర్ కొనాలంటే బడ్జెట్ సరిపోదయ్యా!''

అలా ఆ సంబంధం తప్పిపోయింది.

నారాయణ రావు కేమనిపించిందో గాని... ఈ సంబంధం తప్పిపోయినందుకు నాకు అతని కంటే ఎక్కువ నిరుత్సాహం ఆవరించింది.

అప్పుడప్పుడు ఓ రెండు నెల్లపాటు నారాయణ రావుని కలవలేదు. ఓరోజు మళ్ళీ మా ఇంటికొచ్చాడు. వస్తూ మా అమ్మాయి సంబంధాల విషయం అశ్రద్ధ చేయవద్దంటూ రిక్వెస్ట్ చేశాడు.

''దానికేం నువ్వింతగా చెప్పాలా.. నాకు తెలీదూ... గుండెలమీద కుంపటి బాధ. సరేగాని అడిగావు కాబట్టి చెబుతున్నా..: ఓ ప్లీడరు పెళ్ళికొడుకున్నాడు. హైద్రాబాద్‌లో సొంత ఇల్లు. కారు, బాంక్ బాలెన్స్ వున్నవాడు. గాని ఆసామీషీ చెట్టుకింద ప్లీడరు కాదు. వాళ్ళూ ఫెయిర్‌గా వున్న అమ్మాయికోసం చూస్తున్నారు. ఏమంటావ్? మాట్లాడదామా?'' అన్నా.

ఈలోగా మా ఆవిడ కాఫీలు తెచ్చిచ్చి తనకేం కాదన్నట్టు వెళ్ళిపోయింది.

''కుర్రాడేం చదివాడన్నావ్?'' అడిగాడు నారాయణ రావు కాఫీ సిప్ చేసి.

''బియ్యే ఎల్.ఎల్.బి. ప్రాక్టీసింగ్ లాయర్ అని చెప్పాగా...''

''అఫ్‌కోర్స్.. బానే వుంది గాని అమ్మాయి ఎమ్.ఎ. చదివింది కదా! కుర్రవాడిది కూడా మాస్టర్స్ డిగ్రీ అయితే బావుండేది...'' అన్నాడు నారాయణ రావు.

నాకు ఎక్కడో మండుకొచ్చింది.. ''మాస్టర్స్ డిగ్రీ అంటే యుమీన్.. పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ. ఈజ్ ఇంట్ ఇట్.. ఎల్.ఎల్.బి. పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ కాదేమిటి... డిగ్రీ తర్వాత మూడేళ్ళు చదివేది...''

''అవుననుకో.. కానీ డిగ్రీలో 'ఎమ్' అని వుండాలని నా అభిప్రాయం'' అన్నాడు నారాయణ రావు.

''ఎమ్మా నీ నోట్లో మన్నా... వెధవ పీనుగా'' నాలోనేనే అనుకున్నా... ఇంకేం మాట్లాడకుండా కోపం బయట పడకుండా అతన్ని సాగనంపాను.

లోపలికడుగు పెట్టానో లేదో మా ఆవిడ ఉరిమిచూస్తూ నిల్చుంది ''ఇదుగో.. ఇప్పుడే చెప్తున్నా... ఇక నారాయణ రావు కూతురికి సంబంధాలు వెతికినా, చెప్పినా.. మిమ్మల్ని ఇంట్లో అడుగు పెట్టనివ్వను. ఏమనుకుంటున్నాడతను? ఈ వేళ చెబ్తున్నా ఇతను సంబంధాలు వెతికిన్నాళ్ళు ఆ పిల్లకి పెళ్ళి కుదురదు. డేట్ నోట్ చేసుకోండి. ఆ అమ్మాయికి పెళ్ళి కావాలీ అంటే ఒకే ఒక్క మార్గం. తనకి అన్నివిధాలా నచ్చినవాడికి వలవిసిరి తాను కాలుజారకుండా వాడికాలు బెణక్కుండా ప్రేమా, దోమా అంటూ పెళ్ళి పీటలమీదకి నడిపించడం. ఇది తప్ప గత్యంతరం లేదు. మీరూరుకోండి ఇక మీరు కల్పించుకోవద్దు...'' గట్టిగా వార్నింగిచ్చేసింది.

ఔరా! నా భార్యకి ఇన్ని తెలివి తేటలున్నాయని నాకింత వరకూ తెలీనే తెలీదు. ఔన్లేకుండ బద్దల కొట్టినట్టు చెప్పింది గాని. ఇప్పుడున్న పరిస్థితుల్లో నారాయణ రావు కూతురికి పెళ్ళి కుదరాలంటే మా ఆవిడ చెప్పినట్టు జరగాల్సిందే మరి!

చూస్తుండగానే రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. నారాయణ రావు అడపాదడపా కనిపించి అడుగుతూనే వున్నాడు. సంబంధాల గురించి... ''అలాగే.. ఊ... ఆ...'' అంటున్నానే తప్ప నేనూ కల్పించుకోవడం మానేశాను. కల్పించుకునీ ప్రయోజనం లేదని తెల్సిపోయింది గనక.

రోజులు గడిచిపోతున్నాయ్.

పగలు సూర్యుడు పైకొస్తున్నాడు... తిరిగి రాత్రి చంద్రుడు పైకొస్తున్నాడు.

గ్రహాలు తమగతిలో తిరుగుతున్నాయి.

నారాయణ రావు కూడా తన గతిలో అలాగే తిరుగుతున్నాడు.

నారాయణ రావు గుర్తొచ్చినప్పుడల్లా రూపాయి, పావలా జేబులో వేసుకొని 'స్టార్ హోటల్‌కెళ్దాం' అనే మా కొలీగ్ మాటలు గుర్తొస్తుంటాయి.

(షరా: నారాయణ రావు లాంటి ఎందరో ఆడపిల్లల తండ్రులున్నారు మన దేశంలో.. వాళ్ళకే ఈ కథ అంకితం. -- రచయిత్రి)..